











# ప్రభువైన యేసు క్రీస్తు సిలువలో పలికిన అమూల్యమైన ఏడు మాటలు












# లూకా 23:34- యేసు- తండ్రి, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని చెప్పెను.

యేసుక్రీస్తు జనించిన నాటి నుండి మరణించు వరకు అనగా సిలువ మీద చనిపోయి, తిరిగి లేచి పరలోకం వెళ్ళేంత వరకు ఈ ఏడు మాటలతో పాటు అనేక ప్రాముఖ్యమైన మాటలు మాట్లాడాడు.వాస్తవానికి యేసుక్రీస్తు జ్ఞానానికి నిలువెత్తిన నిర్వచనం.
జ్ఞానియైన, మహాశక్తియైన యేసుక్రీస్తు ఒక వ్యక్తిగా ఈ భూమి మీదకు వచ్చి పలికిన ప్రతి మాట సర్వ మానవాళికి అవసరమే కాక అత్యవసరం అని చెప్పక తప్పదు. ప్రాముఖ్యమైన యేసుక్రీస్తు మాటలంతటిలో అతి ప్రాముఖ్యమైన ఈ ఏడు మాటలలోని పరమార్థాన్ని ఒక్కొక్కటి గా తెలుసుకుందాం. నేర్చుకుందాం.ఆచరణచేద్దాం.
మన భారత జాతి పిత గాంధీ గారికి మహాత్మ అను బిరుదు కలదు. ఒక సాదారణమైన వ్యక్తిగా జన్మించిన గాంధీ గారికి అంతటి మహాత్ముడుఅను బిరుదు ఎలా పొందుకున్నాడు? తండ్రి, వీరేమి చేయుచున్నారో వీరికి తెలియదు కనుక వీరిని క్షమించుడి అను యేసుక్రీస్తు సిలువపై పలికిన ఈ మాటకు ప్రభావితుడై తనను కాల్చిన గాడ్సేను క్షమించుట వలననే. ఆనాడు సిలువలో యేసును చంపువారిని "క్షమించుడి" అను మాటను 2000 సంవత్సరాల తరువాత గాంధీ గారి నోట వినగానే మన భారతీయులు ఆశ్చర్యపోయి చివరికి మహాత్ముడు అను బిరుదుతో సత్కరించిరి. వాస్తవానికి గాంధీ గారు మహాత్ముడు కావుటకు యేసుక్రీస్తు అనే మహాత్ముడు మార్గదర్శియై ఉండుట బట్టియే.
గాంధీ గారిని మహాత్మునిగా చేసిన మాటయే ఈ మొదటి మాట.

లూకా23:34- యేసు- తండ్రి, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని చెప్పెను.
ఈ మాటను ఎవరి గూర్చి, దేన్ని ఉద్దేశించి తండ్రికి ప్రార్థిస్తున్నాడు? ఏయూదులైతే అనగా ఏ ఇశ్రాయేలీయులైతే క్రూరముగా సిలువ శిక్షకు అప్పగించారో, ఎవరైతే ఆయనను పిడుగుద్దులు గుద్దుతున్నారో, ఎవరైతే అయన మీద ఉమ్మి వేస్తున్నారో, ఎవరైతే అయన తలకు ముండ్లకిరీటం పెట్టారో, ఎవరైతే తన చర్మాన్ని కొరడాలతో చీల్చేసారో వారందరి గూర్చి, వారందరిని ఉద్దేశించి మాట్లాడుతున్న మాటయే ఈ మొదటి మాట. పాపమే ఎరుగని యేసుక్రీస్తు పాపములో మునిగి తెలుతున్న పాపుల పక్షాన తండ్రిని క్షమించమని ప్రార్థిస్తున్నాడు.
వీరేమి చేయుచున్నారో వీరెరుగరు అను మాటలోని పరమార్ధం ఏంటి? తన చుట్టు ఉన్నవారు తనపై చేస్తున్నది వారికి తెలియదా? ముమ్మాటికి తెలుసు. మేము యేసును అపహసిస్తున్నామని అపహసిస్తున్న వారికి తెలుసు. మేము యేసుకు అన్యాయపు తీర్పు తీరుస్తున్నాని అన్యాయపు తీర్పునిచ్చిన వారికి తెలుసు. ఏ తప్పు చేయని యేసుకు మేము సిలువ వేస్తున్నామని సిలువను వేస్తున్న వారికి తెలుసు. యేసుయొక్క వస్త్రములు పంచుకుంటున్న వారికి మేము యేసు వస్త్రములే పంచుకుంటున్నామని తెలుసు. పై సందర్భాలను గమనిస్తే వారు చేస్తున్నది వారికి తెలిసియున్నది కానీ వారికి తెలియని ఒక విషయాన్ని గూర్చి వీరేమి చేయుచున్నారోవీరెరుగరు అను మాటను పలికాడు. లేఖనాలలో ముందుగా వ్రాయబడిన సంఘటనలన్నిటిని మేము నేరవేరుస్తున్నామన్న సంగతి సిలువ వేసిన వారికిని, అన్యాయపు తీర్పు తీర్చిన వారికి తెలియదు. అనగా ముందుగానే లేఖనాలలో వ్రాయబడినది మేము నెరవేరుస్తున్నామన్న విషయము వారికి తెలియదు.
కీర్తనలు 22:18- నా వస్త్రములు వారు పంచుకొనుచున్నారు. నా అంగి కొరకు చీట్లు వేయుచున్నారు

యోహాను 19:23,24- సైనికులు యేసును సిలువ వేసిన తరువాత ఆయన వస్త్రములు తీసుకొని యొక్కొక్క సైనికునికి ఒక్కొక భాగము వచ్చునట్లు వాటిని నాలుగు భాగములు చేసిరి.ఆయన అంగిని కూడ తీసుకుని , ఆ అంగికుట్టు లేక పైనుండి యావత్తు నేయబడినది గనుక వారు-దానిని చింపక అది ఎవనికి వచ్చునో అని దాని కోసరము చీట్లు వేయుదమని యొకరితో ఒకరు చెప్పుకొనిరి. వారు నా వస్త్రములను తమలో పంచుకొని నా అంగి కోసరము చీట్లు వేసిరి అను లేఖనము నెరవేరునట్లు ఇది జరిగెను

కీర్తనలు 22:7- నన్ను చూచువారందరు పెదవులు విరిచి తల ఆడించుచు నన్నుఅపహసించుచున్నారు

లూకా 23:35-ప్రజలు నిలువబడి చూచు చుండిరి.అధికారులును- వీడు ఇతరులను రక్షించెను; వీడు దేవుడేర్పరచుకొనిన క్రీస్తు అయినయెడల తన్ను తాను రక్షించుకొనుమని అపహసించిరి

యెషయా 53:12-అతిక్రమము చేయువారిలో ఎంచబడిన వాడాయెను

మార్కు 15:27-మరియు కుడివైపున ఒకనిని ,ఎడమ వైపున ఒకనిని ఇద్దరు బందిపోటు దొంగలను ఆయనతో కూడ సిలువ వేసిరి

(ఫుట్ నోట్ చూస్తే అప్పుడు ఆయన అక్రమకారులలో నొకడుగా నెంచబడెనని చెప్పు లేఖనము నెరవేరినది)

యెషయా 53:8-అన్యాయపు తీర్పునొందినవాడై అతడు కొనిపోబడెను

ఇలా సిలువ సందర్భంలో జరిగిన ప్రతిది కూడ లేఖనాల ప్రకారం జరుగుతుంది కానీ నెరవేరుస్తున్న వారు మాత్రం మేము లేఖనాలను నెరవేర్చుకు ఇలా చేస్తున్నామని తెలియదు. అపో కార్య 13:26- యెరూషలేములో కాపురముండు వారును, వారి అధికారులును ప్రతి విశ్రాంతి దినమున చదవబడుచున్న ప్రవక్తల వచనములనైనను గ్రహింపక, ఆయనకు శిక్ష విధించుట చేత ఆ వచనములనునెరవేర్చిరి. ప్రతి విశ్రాంతి దినమున చదవబడుచున్న ప్రవక్తల వచనములనైనను గ్రహింపలేదు కనుక వీరేమి చేయుచున్నారో వీరికి తెలియదు అను మాటను పలికాడు. నిజానికి యేసుక్రీస్తు ఈ మాటను పలుకకపోతే తన చుట్టూ ఉన్నవారు అనగా లేఖనాలు ఎరుగక ఆయనను శిక్షిస్తున్న వారందరు నరకానికి దిగజారిపోదు రు కనుక క్షమించుమని తండ్రికి ప్రార్ధిస్తున్నాడు.

క్రీస్తుకుకలిగియున్న ఇంతటి గొప్ప క్షమించే మనస్సు మనలో ఉన్నదా? గలతీ 3:27- క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిన మీరందరును క్రీస్తును ధరించియున్నారు. మారుమనస్సు పొంది పాప క్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందిన ప్రతి ఒక్కరు క్రీస్తును ధరించిన వారే.క్రీస్తును ధరించుట అనగా ఏమి? క్రీస్తు మనస్సును ,గుణగణాలను మన బ్రతుకులో ధరించుకొనుటయే( పాటించుటయే, కనపరుచుటయే). క్రీస్తును ధరించుకున్న క్రైస్తవులు క్రీస్తులా క్షమించాలి. నేడు క్షమించే క్రైస్తవులు సమాజములో ఎంత మంది ఉన్నారు? కళ్ళ ముందు ఒక వ్యక్తి వలన నీకు అన్యాయం జరుగుతుంటే ఆ అన్యాయం చేస్తున్న వ్యక్తిని ఆదే క్షణములో క్షమించే మనస్సు నీకు ఉందా?

అంతటి గొప్ప క్షమా గుణం నానాటికి క్రైస్తవ్యములో కనుమరుగౌతుంది.

మనల్ని హింసిస్తున్నవారిని, దుషిస్తున్నవారిని, హేళన చేస్తున్నవారిని,వ్యతిరేకిస్తున్న వారిని క్షమించి వారి మార్పు కొరకు ప్రార్ధన చేయబద్దులమై యున్నాము. క్రీస్తును ధరించిన ప్రతి ఒక్కరు ఆయనలా ఇతరులను క్షమించే మనస్సు కలిగియుండాలి.క్రీస్తులేని క్రైస్తవులు, క్రీస్తు మనస్సు ఎరుగ ని క్రైస్తవులు, క్రీస్తును ధరించుకోనిక్రైస్తవులు, క్రీస్తు లక్షణాలు లేని క్రైస్తవులు క్రైస్తవ సమాజములో ఉండుట బాదను కలిగించే విషయమే.

వాస్తవానికి క్షమించండి అను మాట నోట నుండి ఉచ్చరించుట బహు సులువు కానీ క్షమించుట చాలా కష్టము. కష్టమైనను కూడ తన అడుగుజా ల యందు మనంనడవాలని క్షమించిన గొప్ప త్యాగశీలిగా చరిత్రలో నిలిచి మనకు మాదిరియుంచిపోయెను.

1 పేతురు 2:21- క్రీస్తు కూడ మీ కొరకు బాధపడి, మీరు తన అడుగుజాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరియుంచిపోయెను.

ఆనాడుయేసును సిలువ వేసిన వారిని నేడుమనము ద్రోహులని, పాపులని తిడతూ నిందిస్తాము.అయినను అంతటి ద్రోహులను సైతం తండ్రిని క్షమించమని అడుగుచున్నాడు. మన అనుదిన జీవితములో మాటలలో,చూపులలో,వినికిడిలో,చేతలలో,ప్రవర్తనలో,నడతలో,తలంపులల, ఉహాలలో ,ఆలోచనలో ఇలాఎక్కడో ఒక చోట తప్పు చేస్తూ తప్పిపోతూ చివరికి దేవునిని బహు వేదనను గురిచేస్తున్నాము. ఆనాడుసిలువ వేసిన వారు తప్పిపోతే ఈనాడు మనము తప్పిపోవుచున్నాము. తప్పు వెంబడి తప్పు చేస్తున్న మనకు నిజముగా బ్రతికే అర్హత లేదు. నేటి వరకు మన ము చేసిన ఘోరమైనపాపాలకు శిక్ష పడాలి కానీ ఎందుకు దేవుడు మనల్ని క్షమించి దిన దినము సజీవులుగా ఉంచుతున్నాడు? ఎందుకు దేవుడు మన అయుష్షును దిన దినము పొడిగిస్తున్నాడు?ఎందుకు దేవుడు ఇంకా మనకుబ్రతుకునిస్తూ కొనసాగిస్తున్నాడు? ఈ రోజు మనంఇష్టా నుసారగా జీవిస్తున్నామంటే మన బ్రతుకు వెనుక యేసుక్రీస్తు ప్రార్ధన ఉందని మర్చిపోకూడదు. తప్పు వెంబడి తప్పు చేస్తున్న, చేయకూడని పా పం చేస్తున్న, ఇష్టం వచ్చినట్టు బ్రతికిన , దేవుని ఇష్టాన్ని జరిగించకపోయిన, దేవుని కోసం బ్రతకక పోయిన , మన ఇష్టాలను నేరవేర్చుకుంటున్న నేడు సజీవుగా ఉన్నామంటే కారణం మన వెనుక త్యాగమూర్తి యేసుక్రీస్తు చేస్తున్న విజ్ఞాపన వలననే అని మర్చిపోకూడదు.

రోమా8:34- దేవుని కుడి పార్శ్వమున ఉన్నవాడునుమన కొరకు విజ్ఞాపన చేయువాడు ఆయనే.

నాడు సిలువ వేసిన వారి కొరకు విజ్ఞాపన చేయడమే కాక నేడుమన పక్షాన విజ్ఞాపన చేస్తున్నాడు. ఆనాడుచంపుతున్న వారి కొరకు తండ్రిని

క్షమించమని విజ్ఞాపన చేసాడో అదే యేసుక్రీస్తు ఈనాడు పరలోకములోమన పక్షాన కూడా విజ్ఞాపన చేస్తున్నాడు. నేటి వరకు మనము చేస్తున్న తప్పులకు,మనము పడిపోతున్న బలహీనతలకు శిక్ష అనుభవించవలసిన వారమైయుండగా, ఆ శిక్ష మన మీద పడకుండా మన గురించి తండ్రికి వీరు ఏమి చేయుచున్నారో వీరు ఎరుగరు గనుక వీరిని క్షమించమంటూన్నాడు. నేడుమనం సజీవులుగా ఉన్నామంటే దాని వెనుక పరలోకపు తండ్రి కుడి పార్శ్వమున చేరిమన కొరకు విజ్ఞాపనలు చేస్తున్నాడు గనుకనే.

పాపమే చేయని పరిశుద్ధుడైన యేసుక్రీస్తు పాపులను క్షమిస్తే అను నిత్యం ఏదో ఒక పాపం చేస్తున్న మనం ఇతరులను క్షమించలేకున్నాము. పాపి అంటే యేసుక్రీస్తుకు ఇష్టం- పాపమంటే యేసుక్రీస్తుకు అసహ్యం. పాపిని ప్రేమించాడు-పాపాన్ని ద్వేషించాడు.

2 కోరంది 2:10-మీరు దేని గూర్చియైననుఎవని క్షమించుచున్నారో నేనును వానిని క్షమించుచున్నాను

మత్తయి 6:14-మనుష్యుల అపరాధములను మీరు క్షమించిన యెడల మీ పరలోకపు తండ్రియు మీ అపరాధములను క్షమించును

మత్తయి 18:35- మీలో ప్రతివాడును తన సహోదరుని హృదయపూర్వకముగా క్షమింపని యెడలనా పరలోకపు తండ్రియు ఆ ప్రకారమే మీ యెడల చేయుననేను.

కొలస్సి 3:13- ఎవడైనను తనకు హానిచేసెనని యొకడనుకొనిన యెడల ఒకనినొకడు సహించుచు ఒకనినొకడు క్షమించుడి, ప్రభువు మిమ్మును క్షమించులగున మీరును క్షమించుడి

ఎఫెసి 4:32- ఒకని యెడల ఒకడు దయ కలిగి కరుణా హృదయులై క్రీస్తు నందు దేవుడు మిమ్మును క్షమించిన ప్రకారము మీరును ఒకరినొకరు క్షమించుడి

మత్తయి18:21,22-ఆ సమయమున పేతురు అయన యొద్దకు వచ్చి ప్రభువా, నా సహోదరుడు నా యెడల తప్పిదము చేసిన యెడల నేనెన్ని మరులు అతని క్షమింపవలెను?ఏడు మారుల మట్టుకా? అని అడిగెను. అందుకు యేసు- ఏడు మరులు మట్టుకే కాదు,డెబ్బది ఏళ్ల మారులమట్టుకని నీతో చెప్పుచున్నాను

లూకా 6:38- క్షమించుడి, అప్పుడు మీరు క్షమింపబడుదురు

లూకా 17:3- నీ సహోదరుడు తప్పిదము చేసిన యెడల అతని గద్దించుము;అతడు మారుమనస్సు పొందిన యెడల అతని క్షమించుము

యోహాను 20:23- మీరు ఎవరి పాపములు క్షమింతురో అవి వారికీ క్షమింపబడును

పాపిని ప్రేమించి, క్షమించి పాపాన్ని ద్వేషిస్తూ క్రీస్తుకున్న ఈ మనస్సును మనము కలిగియుందాము. చేసిన తప్పును, పాపమును సాధ్యమైతే వారికీ తెలియజేసి సత్యము చెప్పు- సత్యం వినిపించు-సత్యం అర్థం చేయించు-సత్యప్రకరం మనం నడుస్తూ వారిని నడువుమని చెప్పు.




# యేసుక్రీస్తు సిలువపై పలికిన రెండవ మాటలోని పరమార్ధం

సిలువపై యేసుక్రీస్తు పలికిన ఏడు మాటలన్ని కూడ ఎంతో లోతైన భావాలతో అతి ప్రాముఖ్యమైనవిగా ఉన్నవి.
మన ఆత్మలను రక్షించే శక్తిగల ఒక మాటయైన ఈ రెండవ మాటలోని పరమార్ధాన్ని తెలుసుకుని నేర్చుకుందాం.
కుడివైపున ఒకనితో, ఎడమవైపున మరొకనితో ఇలా ఇద్దరి దొంగలతో యేసుక్రీస్తును సిలువ వేసిరి.
ఒకానొక సమయములో ఒకనితో పలికిన మాటయే ఈ రెండవ మాట .

లూకా 23:43- అందుకాయన వానితో- నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువని నిర్చయముగా చెప్పుచున్నాననెను
తనతో పాటు సిలువ వేయబడిన నేరస్థుని విషయములో ఎందుకు ఈ మాటతో స్పందిచాడో మొదట ఆలోచన చేద్దాము.

లూకా 23:39-42- వ్రేలాడదీయబడిన ఆ నేరస్థులలో ఒకడు ఆయనను దూషించుచు నీవు క్రీస్తువు గదా? నిన్ను నీవు రక్షించుకోనుము, మమ్మును కూడ రక్షించమని చెప్పెను. అయితే రెండవవాడు వానిని గద్దించి నీవు అదే శిక్షావిధిలో ఉన్నావు గనుక దేవునికి భయపడవా? మనకైతే యిది న్యాయమే; మనము చేసినవాటికి తగిన ఫలము పొందుచున్నాము గానీ ఈయన ఏ తప్పిదమును చేయలేదని చెప్పి ఆయనను చూచి యేసు, నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసుకోనుమనెను.
పై సందర్భమును ఆలోచిస్తే మొదటి దొంగ యేసుక్రిస్తును దూషిస్తూన్నట్లుగా, రెండవ దొంగ దూషిస్తూన్న వాడిని గద్దిస్తూ నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసుకోనుమన్నట్లుగా అర్థమవుతుంది.

**మొదటి దొంగ సందర్భ విషయం:**

సిలువపై వ్రేలాడదీయబడిన ఇద్దరి నేరస్తులలో ఒకడు ఆయనను దూషించుచు నీవు క్రీస్తువు గదా? నిన్ను నీవు రక్షించుకోనుము, మమ్మును కూడ రక్షించమని చెప్పెను. ఇప్పటివరకు చనిపోయిన వారిని బ్రతికించితివి, రోగులను బాగుచేసితివి, ఎన్నో అద్భుతాలు, సూచక క్రియలు చేయగలిగే సామర్ధ్యం ఉంది కనుక సిలువ మీద నుండి మొదట నిన్ను నీవు రక్షించుకుని మమ్మును కూడ రక్షించమని దూషిస్తూ పలికెను.
ఆ సమయానికి యేసు శరీరము కోరడా దెబ్బల చేత, కాళ్ళు చేతులకు మేకులు దిగగొట్టుట చేత , తలకు ముండ్ల కిరీటం పెట్టుట చేత ఇలా చివరికి శరీరము మాంసపు ముద్దగా రక్తము కారుతూ అతి దయనీయ స్థితిలో ఉన్నప్పుడు మొదటి దొంగ అనవసరమైన మాటలతో పరలోకపు తండ్రి పనికై ఈ లోకానికి వచ్చిన యేసుక్రీస్తును దుషిస్తూ పలికెను.
మొదటి దొంగ సందర్భ విషయములో మనం తెలుసుకొనవలసిన పాఠములోనికి వెళ్తే వాస్తవానికి దేవునికి సంతోషాన్ని కలిగించే పనులను మనం చేస్తున్నప్పుడు సమాజములో అనేక మంది నానా విధాలుగా దూషణ మాటలతో గాయపరుస్తుంటారు. దేవుని పనులలో మనం ఉన్నప్పుడు సమాజములో కొందరు మన మీద నిందలు, ఆరోపణలు, అబద్ధాలు, హేళనలు, కించపరిచే మాటలు, భాదను కలిగించే దూషణ మాటలతో మన ల్ని గాయ పరుస్తూనప్పుడు ఎలాగైతే యేసుక్రీస్తు సిలువలో మొదటి దొంగ మాటకు స్పందించలేదో ఆలాగు మనం స్పందించవలసిన అవసరత లేదనే విషయం మనం తెలుసుకోవాలి. లోకానుసారాలుగా జీవిస్తూ ,లోకపరమైన పనులలో ఉన్నప్పుడు ఎవరు, ఏ మాట అనరు కానీ దేవుని

పని చేయాలని ముందుకు వస్తే ఎన్నో మాటలు అంటుంటారు.

ఫలానా పని నేను చేయుట ద్వార నా పరలోకపు తండ్రికి గొప్ప సంతోషం కలుగుతుంది అని మీరు నిర్ణయించినట్లైతే సమాజపు వారు మిమ్మును వ్యతిరేకించిన, నిందించిన ,దూషణ మాటల చేత మీ హృదయాన్ని బహు బాధించిన స్పందించకుండా మీకు సాధ్యమైనంత వరకు పని పూర్తి చేయుటలో నిమగ్నమైయుండాలి అనే పాఠమును మొదటి దొంగ సందర్భ విషయము ద్వార తెలియజేస్తుంది. సువర్తికులుగా దేవుని పిల్లలుగా మనం తన యెదుట యధార్ధముగా, పరిశుద్ధతతో నమ్మకముగా జీవిస్తూ తగ్గింపు కలిగి ఉన్నంతవరకు ప్రపంచము కోడై తప్పుడుగా కూసిన ప్రభావితం కానవసరం లేదనే విషయమును మనం గుర్తుపెట్టుకోవాలి. ఎవడు , ఏది తప్పుగా అనుకున్న మనం మాత్రం చేయాలనుకున్న దేవుని పని చేసేయాలి.

## రెండవ దొంగ సందర్భ విషయం:

ఆయనతో కూడ సిలువ వేయబడిన వీరిద్దరు యేసును మొదట నిందించిన వారే. మార్కు 15:32-ఇశ్రాయేలు రాజగు క్రీస్తు ఇప్పుడు సిలువ మీద నుండి దిగి రావచ్చును. అప్పుడు మనము చూచి నమ్ముదమని యొకరితో ఒకరు చెప్పుకొనిరి. ఆయనతో కూడ సిలువ వేయబడినవారును ఆయనను నిందించిరి. అయితే లూకా 23:39-42 వరకు ధ్యానిస్తే మొదటి దొంగ యేసును నిందిస్తూనట్లుగా ,మరొక దొంగ నిందిస్తున్న మొదటి దొంగను గద్దిస్తూ మనకైతే యిది న్యాయమే; ఈయన ఏ తప్పిదమును చేయలేదని ఒప్పుకుంటున్నాడంటే మధ్యలో ఏదో జరిగిందని గ్రహించాలి. తనను దూషిస్తున్న వారిని, నిందిస్తున్న వారిని, బహు క్రురముగా కొరడాలతో చర్మాన్ని చీల్చేసిన వారిని, అన్యాయపు తీర్పు తీర్చిన వారిని , చేతులకు మరియు కాళ్ళకు అతి దారుణముగా మేకులను దిగగొట్టిన వారిని, తలపై ముండ్ల కిరీటము పెట్టిన వారిని ఉద్దేశించి పలికిన మొదటి మాట(లూకా23:34- యేసు- తండ్రి, వీరేమి చేయుచున్నారో వీరెరుగరు గనుక వీరిని క్షమించుమని చెప్పెను) రెండవ దొంగ మనస్సును కదిలించింది. ఇద్దరు దొంగలు మొదట యేసును నిందించినట్లుగా మార్కు 15:32లో చూస్తే మరలా లూకా 23:40కు వచ్చేసరికి నిందిస్తున్న వానిని రెండవ దొంగ గద్దిస్తునట్లు గల మార్పును చూస్తాము. యేసు పలికిన మొదటి మాట సిలువపై ఉన్న రెండవ దొంగకు మరుమనస్సును కలిగించింది. ఎంత అద్భుతం కదూ!

రెండవ దొంగ మార్పు గల సంపూర్ణ సందర్భ అర్ధాన్ని, పరమార్ధాన్ని గ్రహించక క్రైస్తవ సమాజములో అజ్ఞానులైన కొందరు బాప్తీస్మం తీసుకోవాల్సిన అవసరత లేనే లేదని , సిలువకెక్కిన దొంగ బాప్తీస్మం తీసుకోకుండానే పరదైసును పొందుకున్నాడని ఇలా అవివేకముగా మాట్లాడుతూ చివరికి దేవునికే దురమవుతున్నారు. సిలువ మీదనున్న ఆ కొద్ది గంటల వ్యవధిలో యేసుక్రీస్తును ఎంత గొప్పగా అర్ధం చేసుకుని నమ్మాడో చూస్తే అయితే రెండవవాడు వానిని గద్దించి నీవు అదే శిక్షావిధిలో ఉన్నావు గనుక దేవునికి భయపడవా?

అనగా దేవునికి భయపడాలానే ఆలోచనతో ఉన్నాడు.

మనకైతే యిది న్యాయమే; మనము చేసినవాటికి తగిన ఫలము పొందుచున్నాము.. అనగా చేసిన తప్పులను బట్టి ఒప్పుకుంటున్నాడు.

ఈయన ఏ తప్పిదమును చేయలేదని చెప్పి.. అనగా యేసును దూషిస్తున్న సాటి దొంగకు అయన ఏ తప్పిదము చేయలేదని రక్షణ మాటలను ప్రకటిస్తున్నాడు.

ఆయనను చూచి యేసు, నీవు నీ రాజ్యములోనికి వచ్చునప్పుడు నన్ను జ్ఞాపకము చేసుకొనుమనెను.. అనగా ఏ పాపము చేయని యేసు మరణించినను తిరిగి లేస్తాడనే గట్టి విశ్వాసం కలిగియున్నాడు. అనగా క్రీస్తు పునరుర్ధనాన్ని విశ్వసించాడు.

ప్రతికూలమైన పరిస్థితులలో యేసును నమ్మడు.

బాప్తీస్మం తీసుకోకుండానే ఎలాగు రెండవ దొంగ పరదైసును పొందాడను వివరణలోకి పెళ్లే మొదట బాప్తీస్మం అను అజ్ఞా ఎప్పుడు వచ్చిందో తెలుసుకోవాలి. యేసుక్రీస్తు సిలువపై మరణించి, సమాధి చేయబడి, మూడవ దినాన తిరిగి లేచి పరలోకానికి ఇంకా ఆరోహణము కాకముందు శిష్యులతో బాప్తీస్మం ఒక అజ్ఞాగా చెప్పాడు.

మత్తయి28:19,20- కాబట్టి మీరు వెళ్లి, సమస్త జనులను శిష్యులుగాచేయుడి; తండ్రియొక్కయు,కుమారునియొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామములో వారికి బాప్తిస్మమిచ్చుచు నేను మీకు ఏ యే సంగతులను అజ్ఞాపించితినో వాటినన్నిటిని గైకొనవలెనని వారికి భోదించుడి

మార్కు 16:15,16- మరియు మీరు సర్వ లోకమునకు వెళ్లి సర్వ సృష్టికి సువార్తను ప్రకటించుడి. నమ్మి బాప్తీస్మం పొందిన వాడు రక్షింపబడును; నమ్మని వానికి శిక్ష విధింపబడును.

అంతకమునుపు బాప్తీస్మం తప్పనిసరిగా తీసుకోవాలనే ఆజ్ఞ లేదు కనుక దొంగకు అవసరత రాలేదు. ఆనాడు విశ్వసిస్తే చాలు కానీ ఈనాడు

యేసుక్రీస్తు మరణించి తిరిగి లేచిన తర్వాత అజ్ఞాగా చేయమని చెప్పాడు కనుక తప్పక బాప్తీస్మం పొందాలి.
బాప్తీస్మం పొందకపోతే పరలోకానికి అర్హత లేదు.

సిలువపైయున్న రెండవ దొంగ యేసుని మొదటి మాటకు ప్రభావితుడై మరమనస్సు పొంది చివరికి పరదైసుకి వెళ్ళాడు. నేటి వరకు మనం క్రీస్తు ను గుర్చిన ఎన్నో ప్రసంగాలను వింటూనే ఉన్నాము కానీ మన విశ్వాస జీవితం ఎలా ఉంది? ఎన్నో రోజుల నుండి వాక్యం వింటూనే ఉన్నను మా ర్పులేని జీవితాన్ని కొనసాగిస్తూన్నాము కదూ! వింటున్న, నేర్చుకుంటున్న ప్రతి మాట ప్రకారం ప్రవర్తిస్తేనే పరలోకం సాదించుకోవచ్చన్న సత్యాన్ని రెండవ దొంగ ఎలా పరదైసును సంపాదించుకున్న విధానాన్ని బట్టి అర్థమవుతుంది.
వాస్తవానికి ప్రతికూలమైన పరిస్థితిలో యేసు మాటలను విశ్వసించి గొప్ప విశ్వాసిగా మారిన వాడే ఈ సిలువలో చనిపోయిన రెండవ దొంగ. రెండవ దొంగ విశ్వాసాన్ని బట్టి పరలోకం వెళ్ళాడన్న సంగతి గమనించాలి. అనుకూలమైన పరిస్థితిలో నమ్ముటయే కాక ప్రతికూలమైన పరిస్థితిలో దేవునిని విశ్వసించిన వాడే నిజ విశ్వాసి. ఈ రోజు ఎంత మంది ప్రతికూలమైన పరిస్థితులు వచ్చినప్పుడు స్థిర విశ్వాసము కలిగియుందురో ఆలోచించండి. కలిగియున్నది పోయినప్పుడు, నయం కానీ రోగాలు వచ్చినప్పుడు, సమస్తము సమాప్తమవునప్పుడు , కష్టాలు,భాదలు,ఇరుకులు,ఇబ్బందులు, శోధనలు, వేదనలు కలిగినప్పుడు దేవునిపై సంపూర్ణ విశ్వాసము కలిగియున్నామా లేక ఉన్న విశ్వాసాన్ని బలహీనపరచుకుంటూన్నామా అని మనల్ని మనం పరీక్షించుకుందాము.
అనవసరమైన దూషణ మాటలను ఆ మొదటి దొంగ పలికినప్పుడు యేసు స్పందించలేదు కానీ మరో దొంగ రక్షణను దయ చేయవా అని అడిగినప్పుడు తన మాటను అంగికరించుటయే కాక నేడు నీవు నాతో కూడ పరదైసులో ఉందువని నిర్చయముగా చెప్పుచున్నానని ప్రతిస్పందించాడు. దేవుని పనులలో ఉంటున్నప్పుడు మానసికముగా, శారిరకముగా ఎన్నో ఊహించని సందర్భాలకు క్రుంగిపోతాము.
మన మానసిక స్థితి తాత్కాలికముగా సరిగా లేని సమయమున ఫలానా వ్యక్తి నా విశ్వాసాన్ని బలపరచుటకు శక్తివంతమైన దేవుని మాటలు చెప్పండి అని కోరితే వాయిదా వేయకండి. యేసుక్రీస్తు చివరి క్షణాల్లో కూడ దొంగ మరుమనస్సును బట్టి రక్షించాలనుకున్నాడు.
యేసు తాను మరణించేలోపు అవకాశం ఉన్నంత వరకు రెండవ దొంగ ఆత్మను నరకాగ్ని నుండి రక్షించాలనే అనుకున్నాడు. అలానే క్రీస్తును ధరించుకున్న మనం శక్తి గల దేవుని మాటలను ఇతరులకు చెప్పి కొందరినైన రక్షించాలి.

యుదా 1:21- అగ్నిలోనుండి లాగినట్టు కొందరిని రక్షించుడి

యేసు చేసిన ఎన్నో స్వస్థత కార్యాలు చూసినను నమ్మని ఆనాటి జనులు ఆ రోజులలో ఉన్నను యేసును నమ్ముటకు ఆధారమే లేనప్పుడు రెండవ దొంగ విశ్వసించాడు. ఈ ఆశాశ్వతమైన లోకములో దేవుడు ఏదైనా చేస్తే నమ్ముతాననో లేక చేస్తాడని నమ్ముట సరియైన విశ్వాసము కాదు కానీ యేసును నమ్మితే నా పాపాలను క్షమిస్తాడని, పరిశుద్ధతతో వాక్యనుసరముగా జీవిస్తూ మరణిస్తే ఒక దినాన మరణం నుండి నన్ను లేపి శాశ్వత నివాసమైన పరలోకానికి తీసుకొనిపోతాడని నమ్మాలి.




# యేసుక్రీస్తు సిలువపై పలికిన మూడవ మాటలోని పరమార్ధం

బైబిల్ నందు యేసుక్రీస్తు పలికిన ప్రతి మాట వెనుక ఎంతో జ్ఞానము, ఎన్నో అమూల్యమైన సత్యాలు దాగియున్నవి. బహు క్లిష్టమైన పరిస్థితిలో కూడ తన తల్లియైన మరియ పట్ల చూపిన భాద్యతను తెలుపు మాటయే

యోహాను 19:26,27- యేసు తన తల్లియు, తాను ప్రేమించిన శిష్యుడును దగ్గర నిలుచుండుట చూచి అమ్మా! యిదిగో నీ కుమారుడు అని తన తల్లితో చెప్పెను. తరువాత శిష్యుని చూచి యిదిగో నీ తల్లి అని చెప్పెను. ఆ గడియ నుండి ఆ శిష్యుడు ఆమెను తన ఇంట చేర్చుకోనేను.

మరియ యేసేపునకు ప్రధానము చేయబడిన తరువాత వారేకము కాకమునుపు పరిశుదాత్మ వలన గర్భవతియై యేసుక్రీస్తును కనెను.

తరువాత మరియ, యేసేపులిద్దరు ఏకము వలన మరి కొంత మంది కుమారులను, కుమార్తెలను కలిగిరి.

మత్తయి 13:55- ఇతడు వడ్లవాని కుమారుడు కాడా? ఇతని తల్లి పేరు మరియ కాదా?

యాకోబు, యేసేపు సిమోను యూదాయనువారు ఇతని సోదరులు కారా?

మార్కు6:3- ఇతని సోదరీమణులందరు మనతోనున్నారు కారా?..

మత్తయి 12:46- ...అయన తల్లియు సహోదరులును ఆయనతో మాటలాడగోరుచు వెలుపల నిలిచియుండిరి.

యోహాను 2:12- ...అయన తల్లియు, అయన సహోదరులును ,అయన శిష్యులును....

యోహాను 7:3- అయన సహోదరులు ఆయనను చూచి నీవు చేయుచున్న క్రియలు నీ శిష్యులును చూచునట్లు ఈ స్థలము విడిచి యూదయకు వెళ్ళుము.

ఇలా అనేకమైన వచనాల ఆధారముతో యేసుక్రీస్తు పుట్టిన తర్వాత మరియ గర్భాన నుండి పుట్టిన పిల్లలు ఉన్నట్టుగా అర్ధమవుతుంది.

మరి కుమారులు, కుమార్తెలు కలిగియున్నను మరియను యేసుక్రీస్తుచే ప్రేమింపబడిన శిష్యుడికి అప్పగిస్తూ యోహాను 19:26,27లో పలికిన మాటను అనుటకు గల పరమార్ధం ఏంటి? యేసు వెళ్లిపోతూ తన తల్లిని శిష్యుడైన యోహానుకు ఎందుకు అప్పగించాలి?

తన తల్లిని చూసుకొనవలసిన అవసరత  యోహానుకు ఎందుకు వచ్చింది? పై ప్రశ్నలకు గల సంపూర్ణ సమాధానాలు తెలుసుకొనుట ముందు మరియ కుటుంబ పరిస్థితి గూర్చి విశ్లేషాత్మకమైన లేఖన పరిశోధన చేయుట ఆవశ్యకము.

యేసుక్రీస్తు మరియ గర్భాన పడినది మొదలు తుదుకు సిలువలో యేసు చనిపోయేంత వరకు  తనకు ఎన్నో అవమానాలు , భాదలు, హేళనలు, కష్టాలు, నిందలు చుట్టుముట్టాయి. యేసుక్రీస్తు తన గర్భాన పడినది మొదలు తన భర్తయైన యేసేపుచే అవమానాన్ని పొందుకున్నది.

మత్తయి 1:19- ఆమె భర్తయైన యేసేపు నీతిమంతుడైయుండి ఆమెను అవమానపరచనొల్లక రహస్యముగా ఆమెను విడనాడ ఉద్దేశించేను.

చరిత్ర అంతటిలో ఎక్కడ కూడ శారీరక కలయికతో కాక పరిశుద్ధాత్మ వలన స్త్రీ గర్భము ధరించుట అసాధ్యము .

యెషయా7:14లో  కన్యక గర్భవతియై కుమారుని కనును అను ప్రవచనము ఉన్నప్పటికీ యేసేపు తన భార్యయైన మరియను నమ్మలేదు.

పరిశుద్ధాత్మ వలన మరియ గర్భము ధరించింది అను వర్తమనాన్ని దూత యేసేపునకు తెలుపుట వలన చివరికి నమ్మి చేర్చుకోనేను.

మత్తయి 1:20- అతడు ఈ సంగతులను గూర్చి ఆలోచించుకొనుచుండగా , యిదిగో ప్రభువు దూత స్వప్న మందు అతనికి ప్రత్యక్షమై దావీదు కుమారుడవైన యేసేపూ, నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకకు భయపడకుము, ఆమె గర్భము ధరించునది పరిశుద్ధాత్మ వలన కలిగినది; ఆమె యొక కుమారుని కనును.

సమాజమంతటికీ ఈ వర్తమానాన్ని తెలియజేయక యేసేపునకు మాత్రమే దూత అందించింది. దూత స్వప్న మందు చెప్పు వరకు మరియను యేసేపు నమ్మకపోతే మరి దూత ద్వార వర్తమానమే అందుకొని సమాజపు వారు పరిశుద్ధాత్మ వలన మరియ గర్భము ధరించింది అంటే నమ్ముతారా? అసాధ్యము. యేసేపు ప్రమేయమే లేకుండా మరియ గర్భము పొందుకున్నది అంటే సమాజము వారు నమ్మలేని పరిస్థితి. ఏమి లేకపోయినా ఉన్నట్టుగా మాట్లాడుకునేది ఈ నర సమాజము. అప్పటికే సమాజములో మరియ గూర్చి తప్పుగా మాట్లాడుకునేవారు మొదలైయ్యారు. నేడు వివాహము కాకముందు స్త్రీ గర్భము దాల్చితే ఎంత దారుణముగా తనను సమాజం చూస్తుందో ఆలోచించండి. యేసుక్రీస్తు తర్వాత మరియకు పుట్టిన పిల్లలు కూడ యేసుక్రీస్తుపై విశ్వాసము లేనివారిగా , ప్రేమించలేనట్టుగా అర్థమయ్యే సందర్భమును చూస్తే యోహాను 7:5- అయన సహోదరులైనను అయన యందు విశ్వాసముంచలేదు. యేసుక్రీస్తు వలన ఎన్నో హేళన మాటలు, ఎన్నో అవమానాలు , హృదయానికి భాదను కలిగించే ఎన్నో మాటలు అటు సమాజపు వారి నుండి ఇటు తన పిల్లల నుండి పొందుకునట్లుగా మనకు అర్థమవుతుంది.

భవిష్యత్తు నెరిగిన ప్రవక్తయైన సుమెయేను యేసుక్రీస్తు బాలుడుగా ఉన్నప్పుడే మరియతో అంటున్న మాటను చూస్తే లూకా 2:34- సుమెయే ను వారిని దీవించి ఇదిగో అనేక హృదయాలోచనాలు బయలుపడునట్లు , ఇశ్రాయేలులో అనేకులు పడుటకును తిరిగి లేచుటకును వివాదాస్పదమైన గురుతుగా ఈయన నియమింపబడియున్నాడు. అనగా పరిశుద్ధాత్మ ద్వార యేసుక్రీస్తు పుట్టాడన్న విషయము ఒక వివాదమే.

యేసుక్రీస్తు సహోదరులు అయన మీద ఎందుకు పగ పెంచుకున్నారు? అక్కడక్కడ జన సమూహము మధ్య యేసుక్రీస్తు భోదిస్తున్నప్పుడు ఈ యేసుక్రీస్తు వీళ్ళ అన్ననే కాని సొంత అన్న కాదు అనే లోకుల మాటలు తన సహోదరులు వింటుంటే రోజురోజుకు రగిలిపోతూ చివరికి మరియను కూడ నమ్మని పరిస్థితి ఏర్పడింది. నిజానికి క్రీస్తును కన్నందుకు మరియకు ఈ లోకములో కన్నీరే మిగిలింది. ఎటువంటి క్లిష్ట పరిస్థితి లో మరియ ఎవరికీ మద్దతు తెలుపుతుంది? పరలోకపు తండ్రి కుమారుడిగా , దేవుని పనిలో ఉన్న యేసుకు మద్దతు ఇవ్వాలా లేక ఆ తర్వాత పుట్టిన పిల్లలకు మద్దతు ఇవ్వాలా అను విషయములో సతమతమయ్యింది. చివరికి అయన ఇంటివారు ఆయనకు మతి చలించియున్నది అని దూషించిరి. మార్కు 3:21- అయన ఇంటివారు సంగతి విని ,అయనకు మతి చలించియున్నదని చెప్పి ఆయనను పట్టుకొనబోయిరి.

తన కుటుంబమంతటిలో యేసును గూర్చి బాగుగ తెలిసిన వ్యక్తి ఒక్క మరియనే. మత్తయి 12:46-50 వరకు గల సందర్భములో ఒకానొక రోజు యేసును చూడడానికి తన పిల్లలతో యేసును కలువుటకు వెళ్ళింది. అప్పుడు శిష్యుడు యేసుతో నీ తల్లి, సహోదరులు నీ కోసము ఎదురు చూస్తున్నారని తెలియజేస్తే బదులు సమాధానముగా ఎవరు నా తల్లి, ఎవరు నా సహోదరులు అను మాటకు మరియ పిల్లలు మిక్కిలి కోపముతో తనను నిందించిరి. తన పిల్లలు , సమాజము చేత మరింత భాదపడుతుందని, ఇక చూసుకునే వాళ్ళు లేరని ముందుగానే తెలిసి సిలువలో అతి క్లిష్టమైన పరిస్థితిలో కూడ తల్లి పట్ల భాద్యత కలిగి తన తల్లిని యోహానుకు అప్పగించాడు. ఇప్పటివరకు గల వివరణలో మనం ఆలోచన చేస్తే యేసుకు తన తల్లి విషయములో ఎంతో భాద్యత కలిగియున్నట్టుగా, నేరవేర్చినట్టుగా అర్థమవుతుంది.

యేసుక్రీస్తును అంగీకరిస్తే ఇంటివారు కూడ దూరపెట్టు పరిస్థితి నేడు మనం చూస్తున్నాం.ఈ రోజు ఎంత మంది కుటుంబములో లేదు ఈ పరిస్థితి? యేసుక్రీస్తును నమ్మితే మన కుటుంబాన్ని వదిలివెల్లిపో అను సందర్భాలు అనేక కుటుంబాలలో మనం చూస్తున్నాము కాని మరియ విషయము లో అనాది నుండి ఎన్ని ఆటంకాలు వచ్చిన , తన కుటుంబపు వారు వెలి వేసినను చివరికి యేసుక్రీస్తుతోనే ఉంది. నేటి సమాజములో అనేకమం దికి యేసుక్రీస్తు అంటే, అయన వ్యక్తిత్వం అంటే, జీవితము అంటే ,తన భోదనలు అంటే,తన నడవడిక అంటే మిక్కిలి ఇష్టపడుతారు కాని కలుగుతున్న

శ్రమలు, అపత్కాల వలన యేసును విడచి, మరచి దూరమవుతారు. భవిష్యత్తు తెలిసిన యేసుక్రీస్తు ఈ పరిస్థితి పట్ల ఎలా ఉండాలో చెప్పాడు [ లూకా 18:29,30 , మార్కు 10:28,29, లూకా 12:51-53]. యేసుక్రీస్తును స్వరక్షకుడిగా విశ్వసించి అంగీకరిస్తే కొన్ని పరిస్థితులలో ఇంటివారు కూడ నీకు విరోధులు అయ్యే అవకాశం ఉంది. ఇంటివారు దురమవ్వుతున్నారు అని యేసును తిరస్కరించారో ఒకానొక రోజు తీర్పులో మీరు ఎవరో నాకు తెలియదు అంటాడు.

ప్రభువుని అంగికరించి, విశ్వసించి అయన కొరకు జీవిస్తుంటే మన ఇంటిలో స్థానము పోగొట్టుకునే సందర్భాలు వచ్చినను స్థిర విశ్వాసముతో ఓర్పు కలిగి సహనముతో ముందుకు కొనసాగితే దేవుడు తప్పక సహాయపడుతాడు. ఎవరో ఏదో అనుకుంటారని, ఎవరో ఏదో చేస్తారని , ఎవరో ఏదో అంటారని యేసుక్రీస్తు నుండి దూరమవ్వకు. ఒక మరియ జీవితములా అంతము వరకు సహించు. తల్లి పట్ల యేసుక్రీస్తు నెరవేర్చిన భాద్యతను , మరియ వలె ఎన్ని ఆటంకాలు వచ్చిన ధైర్యముగా ఎదుర్కునే పట్టుదలను గుర్తుఎరిగి ఆలాగు మన బ్రతుకులో చూపుతూ యేసుక్రీస్తు కొరకు మన జీవితాన్ని అంకితము చేద్దాం..




# యేసుక్రీస్తు సిలువపై పలికిన నాల్గవ మాటలోని పరమార్ధం

యేసుక్రీస్తు సిలువపై ప్రేలాడుతూ మరి కొద్ది క్షణాలలో చనిపోవుటకు సిద్ధముగా ఉన్నప్పుడు మిక్కిలి ఆవేదన పడుతూ తండ్రియైన దేవునితో పలికిన మాటయే

మత్తయి 27:46- ఇంచుమించు మూడు గంటలప్పుడు యేసు ఏలి, ఏలి లామా సబక్తానీ అని బిగ్గరగా కేకవేసెను.

ఆ మాటకు నా దేవా, నా దేవా నన్నెందుకు చెయ్యి విడిచితివని అర్ధము.

యేసుక్రీస్తు భూమి మీదకు రాకమునుపు తనను గుర్చిన ఎన్నో ప్రవచనాలను ఎందరో ప్రవక్తల ద్వార ముందుగానే తండ్రియైన దేవుడు పలికించా డుతనకు సంబందించిన ఎన్నో ప్రవచనాలను యెషయ గ్రంధములోను, కీర్తనల గ్రంధములోను ఇలా అనేకమైన ప్రవక్తల గ్రంధాలలోను ఉన్నవి. తనను గుర్చిన ప్రతి ప్రవచనాల నెరవేర్పు విషయములో అతి జాగ్రత్త తీసుకున్నట్టుగా మనకు అర్ధమవుతుంది. రాబోయే దినాలలో యేసుక్రీస్తు యొక్క జీవితం ఎలా ఉండబోతుందో దావీదు ద్వార దేవుడు ముందుగానే వ్రాయించిన సందర్బ వచనమును చూస్తే కీర్తనలు 22:1- నా దేవా నా దేవా, నీవు నన్నేల విడనాడితివి? నన్ను రక్షింపక నా అర్తధ్వని వినక నీవేల దూరముగానున్నావు?

ఈ మాటయే నాల్గవ మాటగా సిలువలో పలికి లేఖనమును నెరవేర్చిన సంగతిని ఇక్కడ మనం తెలుసుకుంటాము.

సిలువ మరణానికి ముందు గేత్సేమనే వనములో తండ్రీ, నీ చిత్తమైతే ఈ గిన్నె నా యొద్ద నుండి తొలగిపోనిమ్మని ప్రార్థించినట్లుగా

మనం మత్తయి 26:39లో చూస్తాము. యేసుక్రీస్తు కూడ మనలాంటి రక్త మాంసము కలిగి జీవించారు కాబట్టి ఆ భాద, ఆవేదన ఎలా ఉండబోతుం దో ముందుగా ఎరిగి, ప్రవచనాల సారం ముందుగా గ్రహించి చివరికి సిలువకెక్కితే ఆ భాదను తట్టుకోగాలనో లేదో అనే విధముగా అయన శరీరం ఆయనను బహుగా ఇబ్బందికి గురి చేసింది.  ఆయనను సిలువ వేస్తారని , చేతులను మరియు పాదాలను పొడుస్తారని

క్రీస్తుకు పూర్వం 1000 సంవత్సరాల ముందు పుట్టిన దావీదుతో దేవుడు పలికించిన అమూల్యమైన లేఖన సారాన్ని చూడగలము.

తండ్రియైన దేవుడు తన చెయ్యి ఒక దినాన విడిచిపెడుతాడనే సంగతి తెలుసు. చివరి క్షణాలలో అనగా సిలువలో కొన్ని నిముషాల వ్యవధిలో మరణించుట ముందు అయన ఈ నాల్గవ మాట పలుకుతున్నాడంటే ఏదో పరమార్ధం దాగియున్నది.

ప్రపంచ వ్యాప్తముగా నేటికి బ్రతికియున్న వారి సంఖ్య 750 కోట్లపై మాటే. ప్రతి రోజు భాదపడుతున్న వారిని మనం చూస్తూ ఉంటాము. వాళ్ళంతా ఎందుకు భాదపడుతున్నారని ఆలోచిస్తే భర్త మరిచాడని విడిచాడని భాదపడే భార్యలు, భార్య మరిచిందని విడిచిందని భాదపడే భర్తలు, పిల్లలు తమను  విడిచిపెట్టారని భాదపడే తల్లితండ్రులు, తల్లితండ్రులు తమను విడిచి వెళ్లిపోయారని భాదపడే పిల్లలు , అయిన వారు, భంధువులు , స్నేహితులు పట్టించుకోవట్లేదు అని భాదపడేవారు, నా ద్వార మేలులు పొందిన వారు చివరికి దూరమయ్యారు అని ఇలా రక రకాల కారణాలతో భాదపడుతున్నవారిని మనం అనుదినం చూస్తున్నాము. అయితే యేసుక్రీస్తు మాత్రం తండ్రియైన దేవుడు తన చెయ్యి విడిచారని ఆవేదనను వ్యక్తపరుస్తున్నారు. వాస్తవానికి ఆయనను విడిచిన వారిలో కుటుంబసభ్యులు , శిష్యులు, అయన ద్వార అనేక మేలులు, స్వస్థతలు పొందిన ఎందరో ఉన్నాను అనగా ఇంత మంది తనను విడిచినను భాదపడని యేసుక్రీస్తు తండ్రియైన దేవుడు విడిచిపెట్టినందువలన ఆవేదనను కనపరుస్తున్నట్లుగా ఈ నాల్గోవ మాటలో అర్ధమవుతుంది.

లోకములో తన వారు తనని విడిచిపెడితే భాదపడేవారు ఉంటారు కాని దేవుడు నా చెయ్యి విడిచిపెట్టాడని భాదపడేవారు కనబడరు. అనుదినము మన చూపుల ద్వార , మాటల ద్వార ,తలంపుల ద్వార, తీసుకును నిర్ణయాల ద్వార, వినికిడి ద్వార ఇలా అనేక సందర్భాలలో అనేక రీతులుగా తప్పులు చేస్తూ దేవుని బందము నుండి దురమవ్వుతున్నాము. ఎల్లవేళలా మనం చేసే ప్రతి తప్పును బట్టి  మన మనసాక్షి

మనల్ని నిందిస్తుంటుంది. మరైతే మనం దేవునికి దగ్గరగా జీవిస్తున్నామా లేక దేవుడే మన నుండి దురమవ్వుతున్నడా?
నేను చేస్తున్న అపరాధాలను బట్టి దేవునికి దూరమవ్వుతున్నాను అనే భాద మనలో లేదు కాని మనకు ఇష్టమైన వారు మనల్ని విడిచిపెడితే మాత్రం బహు ఆవేదనకు గురి అవ్వుతాము. అయితే లోకములో యేసుక్రీస్తుకు ఎంతో మంది దూరమయినను పట్టించుకొనలేదు కాని తండ్రియైన దేవుడు తన చెయ్యి విడిచేసరికి బహు భాదపడుతున్నాడు. మరి మన పరిస్థితి? ఎవరి నుండి దూరమైతే మనం భాదపడుతున్నాము? దేవుడు దూరమైతేనా లేక మనుష్యులు దురమైతేనా? మనల్ని మనం పరిశిలించుకుందాము.
మరి తండ్రియైన దేవుడు యేసుక్రీస్తు చెయ్యి విడిచిపెట్టు గల పరమార్ధం ఏంటి? నా దేవా, నా దేవా నన్నెందుకు చెయ్యి విడిచితివని ప్రత్యేకముగా సిలువలో మాట్లాడవలసిన అవసరత ఎందుకు ఏర్పడింది? నీ కోసము, నా కోసం అనగా ఈ సర్వమానవాళిని పాపము నుండి రక్షించుటకు తండ్రియైన దేవుడు యేసుక్రీస్తు చెయ్యి విడువవలసి వచ్చింది. మన కోసమే యేసుక్రీస్తు చెయ్యి తండ్రియైన దేవుడు విడిచాడని, మనల్ని నరకం నుండి కాపాడుట కోసమే యేసుక్రీస్తు చెయ్యి తండ్రియైన దేవుడు విడిచాడని మొట్టమొదట మనం గుర్తుంచుకోవాలి. యేసుక్రీస్తు ఈ నాల్గవ మాటను సిలువలో పలుకకపోతే మనల్ని పాపము నుండి రక్షించుట కొరకు తండ్రియైన దేవుడు తన ప్రియ కుమారుని సైతం సిలువ మరణానికి వదిలిపెట్టాడన్న సంగతి తెలియదు. మనుష్యులందరు దేవునికి దూరమవుతున్న పరిస్థితిలో వీరిని కాపాడుకోవాలని, చచ్చి నరకానికి వెళ్ళిపోతున్న తన పిల్లలను రక్షించుకోవటానికి , తన పిల్లలను తిరిగి తన చెంతకు చేర్చుకోవాలని తండ్రియైన దేవుడు మనల్ని ప్రేమించి తన ప్రియ కుమారుడైన యేసుక్రీస్తును ఈ లోకానికి పంపి ఆయనను మన కోసమై సిలువ మరణానికి అప్పగించాడు.
యోహాను 3:16- దేవుడు లోకమును ఎంతో ప్రేమించెను. కాగా అయన తన అద్వితీయకుమారునిగా పుట్టిన వానియందు విశ్వాసముంచు ప్రతివాడును నశింపక నిత్యజీవము పొందునట్లు ఆయనను అనుగ్రహించెను.
రోమా8:32-తన సొంత కుమారుని అనుగ్రహించుటకు వెనుక తీయక మన అందరి కొరకు ఆయనను అప్పగించినవాడు.... యేసుక్రీస్తు చెయ్యి తండ్రి విడిచిపెట్టకపోతే నేడు మనకు పాపా క్షమాపణ లేదు, మన పాపాలకు ప్రాయశ్చిత్తం లేదు మరియు చివరికి పరలోకమే ఉండదు. అనేకమంది పిల్లలను రక్షించుకోవడం కోసం, రక్షణలోనికి తెచ్చుకోవడం కోసం చివరికి తన ప్రియ కుమారుడైన యేసుక్రీస్తును బలిగా అర్పించాడంటే మన పట్ల ఎంత ప్రేమ దాగియున్నదో తెలుసుకోవాలి. ఎంత గొప్ప ప్రేమ! పాపిగా మనల్ని చూడలేక, పాపాలు పరిహరించే పరిహారంగా యేసుక్రీస్తును ముందుగా పరలోకములో సిద్దపరచి కడవరి కాలమందు మన కోసం ఆయనను ప్రత్యక్షపరచి ఈ లోకానికి పంపించి మన పాపాలకు బదులుగా పరిశుద్దుడైన యేసుక్రీస్తును బలిగా అర్పించి, అయన ద్వార తిరిగి మనల్ని పరలోకానికి చేర్చుకోవాలనే కోరిక ఉందంటే మన యెడల తండ్రియైన దేవుడు ఎంతటి ప్రేమను కనపరిచాడో అర్ధమవుతుంది. ఈ ప్రపంచ ప్రజలందరిని కాపాడుట కొరకు తన చెయ్యి విడిచాడు.
అనునిత్యము మనల్ని కాపాడుతూ, మనకు కావాల్సినవన్నీ తగిన సందర్భమున ,తగిన కాలమున తీరుస్తున్న కూడ నేడు మనం వాక్యనుసారముగా జివించకుండా, తన మాటను వినకుండా మనకు ఇష్టమొచ్చినట్లుగా బ్రతుకుతూ చివరికి పాపాలతో మునిగితేలుతున్న సందర్భములో ఉన్నను మనల్ని రక్షించుటకు తన ప్రియ కుమారునిని రక్షకునిగా ఈ లోకానికి పంపాడంటే దేవుడు మనల్ని ఎంత ప్రేమిస్తున్నాడో తెలుసుకోవాలి. మనం రక్షింపబడాలని యేసుక్రీస్తు చెయ్యి విడిచాడనే సత్యము నీకు అర్ధమైతే నేడే మన బ్రతుకు విధానాన్ని సరిద్దుకుని దేవునికి ఇష్టులుగా జీవించుటకు తీర్మానించుకుందాము.
దేవుని కొరకు బ్రతకాలని నిర్ణయం తీసుకుని, దేవుని ఇష్టాన్ని నెరవేర్చాలని పట్టుదల కలిగి ఆలాగు జీవిస్తారో వాళందరిని యేసుక్రీస్తు వలె చెయ్యి విడిచిపెడుతాడని తెలుసుకోవాలి. అనగా దేవుని పనిలో ఉన్న తన పిల్లల జీవితములో ఏదో ఒక దశలో వదిలేసే కాలము ఉంటుంది. అదే పరిక్ష కాలము. ఉదా- యోబు దేవుని యెదుట యదార్ధవంతుడు, చెడుతనమును విసర్జించువాడు, భయభక్తులు కలిగిన వాడిగా ఉన్నాడు. యోబు యొక్క గుణ గణాలను దేవుడు సాతనుకు చెప్పుచున్నాడు. అన్ని కలిగియున్నాయి గనుక యోబు నీకు దగ్గరగా ఉన్నాడు అయితే ఒక్కసారి యోబు జివితములోనికి నన్ను అనుమతినిస్తే నీ సేవకుడో కాదో నిరుపిస్తాను అని దేవునితో సాతాను జవాబునిచ్చాడు. దేవుడు సాతానుకి యోబును అప్పగించినను చివరికి పరీక్షలో నెగ్గాడు. ( యోబు 2: 1-10 వరకు పై సందర్భమును చూస్తాము)
లూకా 22:31- ఇదిగో సాతాను మిమ్మును పట్టి గోధుముల వలె జల్లించుటకు మిమ్మును కోరుకొనెను ....దేవుని పనిలోనున్న వారిని సాతాను కోరుకుంటూనట్లుగా మనం పై వచనములో చూస్తున్నాము.
తండ్రియైన దేవుడు తన పనిలోనున్న వారిని ఒకానొక సందర్భమున పరిక్ష కొరకు సాతానుకు అప్పగించి చెయ్యి విడువవలసివస్తుంది. అట్టి సమయములో యోబు వలె స్థిర విశ్వాసముతో నిలబడాలి.
చివరిగా ఈ నాల్గవ మాట ద్వార పాపము నుండి మనల్ని విడిపించి రక్షించుటకు తన ప్రియకుమారుడైన యేసుక్రీస్తును సిలువ మరణానికి అప్పజెప్పి చెయ్యి విడిచాడని మరియు దేవుని యెదుట యదర్ధముగా పరిశుద్ధముగా జీవిస్తున్నప్పుడు మనల్ని సాతానుకు అప్పజెప్పి విడిచిన సమయమున అంతము వరకు స్థిర విశ్వాసము కలిగి దేవునికై నిలబడాలి అనే పరమార్ధమును తెలియజేస్తుంది.




# యేసుక్రీస్తు సిలువపై పలికిన ఐదవ మాటలోని పరమార్థం

మరి కొద్ది క్షణాలలో చనిపోయే పరిస్థితిలో కూడ దప్పిగొనుచున్నానని యేసుక్రీస్తు అడుగుటకు గల కారణమును మొదట మనం తెలుసుకోవాలి. భయానకముగా , అతి క్రురముగా ప్రతి రక్తపు బొట్టును చిందించి బ్రతుకుటకు ఏ మాత్రం అవకాశం లేనప్పటికీ దప్పిగొనుచున్నానను మాటలోని పరమార్థం ఏంటి? ఏలాగో చనిపోతానని తెలిసిన యేసుక్రీస్తుకు నాకు దాహం అవ్వుతుందని వారిని అడుగుతున్నడంటే దాని వెనుకున్న పరమార్థం ఆనాడున్న భయంకరమైన యూదులకు అర్థం కాలేదు. వాస్తవముగా అసమయములో కూడ అనగా సిలువలో అంతటి భాదను అనుభవిస్తున్న కూడ  ఐదవ మాటను అనుటకు గల కారణమే "లేఖన నెరవేర్పు".

యోహాను 19:28,29- అటు తరువాత సమస్తమును అప్పటికి సమస్తమైనదని యేసు ఎరిగి, లేఖనము నెరవేరునట్లు – నేను దప్పిగొనుచున్నాననెను. చిరకతో నిండియున్న యొక పాత్ర అక్కడ పెట్టియుండెను గనుక వారు ఒక స్పంజి చిరకతో నింపి, హిస్సోపు పుడకకు తగిలించి అయన నోటికి అందించిరి.

వ్రాయబడిన లేఖనము నిరర్థకము కాకుండునట్లు అతి క్లిష్టమైన పరిస్థితిలో కూడ నెరవేర్చాలన్న తపనను ఇక్కడ చూస్తున్నాము. దావీదు ద్వార దేవుడు వ్రాయించిన ఈ సందర్భము గల లేఖనాన్ని చూస్తే  కీర్తనలు 69:21- వారు చేదును నాకు ఆహారముగా పెట్టిరి. నాకు దప్పియైనప్పుడు చిరకను త్రాగనిచ్చిరి. ముందుగా చెప్పబడిన ఈ లేఖనమును సిలువపై ఐదవ మాటగా పలికి నెరవేర్చెను.

యేసుక్రీస్తును ఉద్దేశించిన ఈ లేఖన సారాన్ని ఆ దుష్టులైన యూదులకు కాని, సైనికులకు కాని అర్థం కాక చేదైన ఒక చిరకను అనగా త్రాగుటకు ఎట్టి పరిస్థితిలో అనుకూలించని చిరకను అయన నోటికి అందించిరి. కన్ను మూసే లోపు యేసుక్రీస్తు చేస్తున్న అద్భుత విషయమే " లేఖన నెరవేర్పు". ముందుగా వ్రాయబడిన లేఖనాలన్నిటిని కన్ను మూసే లోపు నెరవేర్చాలనే ఆలోచనతో ఉండెను. ఇలా ఆలోచించుకుంటూ పోతే యేసుక్రీస్తు గురించి లేఖనాలలో ఏ విషయాలైతే వ్రాయబడ్డాయో వాటన్నిటిని నెరవేర్చి మరణించినట్లుగా బైబిల్ నందు చూస్తున్నాము. పరలోకపు తండ్రి చేయమన్న ప్రతి కార్యమును ప్రతి సమయమున నెరవేర్చి చివరికి యేసుక్రీస్తు మరణించెను. ఏ రీతిగా అయితే యేసుక్రీస్తు పట్ల పరలోకపు తండ్రికి సంకల్పము ఉందో ఆ రీతిగానే మన యెడల కూడ సంకల్పం ఉంది. ఎలా అయితే తండ్రి సంకల్పాన్ని కన్ను మూసే లోపు నేరవేర్చాడో అలానే మన యెడల తండ్రికున్న సంకల్పాన్ని మనము యేసుక్రీస్తు వలె నెరవేర్చాలి. మన గురించి వ్రాసిన, మనం చేయవలసిన పనిని తెలిపే లేఖనమే

ఎఫెసి 1:4,5,6- ఎట్లనగా తన ప్రియుని యందు తను ఉచితముగా మనకనుగ్రహించిన తన కృప మహిమకు కీర్తి కలుగునట్లు, తన చిత్త ప్రకారమైన దయా సంకల్పము చొప్పున యేసుక్రీస్తు ద్వారా తనకు కుమారులనుగా స్వికరించుటకై "మనలను ముందుగా తన కోసము నిర్ణయించుకొని మనం తన యెదుట పరిశుద్ధులమును, నిర్దోషులమునైయుండవలెనని జగత్తు పునాది వేయబడక మునుపే ప్రేమ చేత అయన క్రిస్తులో మనలను ఏర్పరచుకొనెను".

మనం జన్మించింది దేవుని కోసమని, బ్రతికినంత కాలము అయన దృష్టికి  మనము పరిశుద్ధులుగా , నిర్దోషులుగా ఉండాలన్నది లేఖనాలలో మన గురించి వ్రాయబడింది. యేసుక్రీస్తును గూర్చి ముందుగా వ్రాయబడిన లేఖనాలన్నిటిని నెరవేర్చి మరణించినట్లుగా అనేకమైన వచనాలు తెలియజేస్తుంది. అయితే మన గురించి వ్రాయబడిన పై లేఖనమును యేసుక్రీస్తు వలె నేరవేర్చలా లేక నెరవేర్చకుండా మరణించాలా? అయన యెదుట మనం పరిశుద్ధులుగా, నిర్దోషులుగా బ్రతకాలన్న వ్రాయబడిన  లేఖనాన్ని నెరవేర్చుటబద్ధులమైయున్నాము. ఒక్క మాటలో

చెప్పాలంటే మన హృదయ అంతరంగములో పరిశుద్ధతను చూడాలని మన యెడల ఉద్దేశమును పరలోకపు తండ్రి కలిగియున్నాడు. ఈ సృష్టిని సృష్టించక మునుపే భూమి మీదకు రాబోతున్న తన పిల్లలమైన మన పట్ల గల సంకల్పము ఇదే. ఏ రీతిగా అయితే ఆ సమయములో కూడ ఐద వ మాటగా వ్రాయబడిన లేఖనమును యేసుక్రీస్తు నేరవేర్చాడో ఆ రీతిగానే మన పట్ల తండ్రికున్న ఈ సంకల్పాన్ని నెరవేర్చాలి.

పరిశుద్ధత కలిగి జీవించకుండా చివరికి ఒక దినాన మరణించాక ఆ పరలోకపు తండ్రిని చూడలేము అనే మాటను చూస్తే హెబ్రియులకు 12:14- పరిశుద్ధత లేకుండా ఎవడును ప్రభువును చూడడు. మన అనుదిన జీవితములో అన్ని విషయాలనందు పరిశుద్ధతను కలిగియున్నామా? ఒక్కసారి పరిశీలించుకోండి. మానవ హృదయములో ఉండు అపరిశుద్ధమైన క్రియలను యేసుక్రీస్తు మాటలలోని చూస్తే మార్కు 7:21,22,23- లోపల నుండి అనగా మనుష్యుల హృదయములో నుండి దురలోచనలును, జారత్వములును, దొంగతనములును ,నరహత్యలును, వ్యభిచారములును, లోభములును, చెడుతనములును ,కృతిమమును, కామవికారమును, మత్సరమును , దేవదుషణయు అహంభావమును, అవివేకమును వచ్చును. ఈ చెడ్డవన్నియు లోపలినుండియే బయలువెళ్లి మనుష్యుని అపవిత్రపరచునని అయన చెప్పెను.

మానవ హృదయాన్ని పాడు చేసే అనేకమైన క్రియలను పై వచనములో మనం చూస్తున్నాము. పరలోకపు తండ్రికి మన యెడల ఉన్న సంకల్పాన్ని నెరవేర్చకుండా ఉండే పై చెడు క్రియలను మన జీవితములో కలిగియున్నమా అని పరీక్షించుకుందాము.

మరొక సందర్భమును ఆలోచిస్తే మరొక చోట దాహము అను పదము గుర్చిన భావాన్ని చూస్తే మత్తయి 25:35నుండి 40- నేను ఆకలిగొంటిని, మీరు నాకు భోజనము పెట్టితిరి; దప్పిగొంటిని, నాకు దాహమిచ్చితిరి, పరదేశినైయుంటిని నన్ను చేర్చుకొంటిరి. దిగంబరినైయుంటిని, నాకు బట్టలిచ్చితిరి; రోగినైయుంటిని, నన్ను చూడవచ్చితిరి; చెరసాలలో ఉంటిని, నా యొద్దకు వచ్చితిరని చెప్పును. అందుకు నీతిమంతులు ప్రభువా, ఎప్పుడు నీవు ఆకలిగొనియుండుట చూచి నీకు ఆహారమిచ్చితిమి? నీవు దప్పిగొనియుండుట చూచి ఎప్పుడు దాహమిచ్చితిమి? ..........40- అందుకు రాజు మిక్కిలి అల్పులైన యీ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిర్చయముగా మీతో చెప్పుచున్నానని వారితో అనును.

పై వచనాల సందర్భములో ఏ దాహము గూర్చి చెప్పబడుతుంది? అల్పులైన యీ నా సహోదరులలో ఒకనికి మీరు చేసితిరి గనుక నాకు చేసితిరని నిర్చయముగా మీతో చెప్పుచున్నానను మాటలో గల భావం ఏంటి? పరలోకమందున్న తండ్రి చిత్త ప్రకారము చేయువారు నా సహోదరులు అని యేసు అంటున్నాడు. ఏంటి తండ్రి చిత్తము? నశించిపోతున్న ఆత్మలను శక్తివంతమైన మాటలను చెప్పి రక్షించుటయే. ఆత్మల రక్షణ పట్ల పట్టుదల కలిగి పని చేస్తున్న సేవకుల సేవలో మనము సహకరులుగా ఉండాలి. వాస్తవానికి యేసుక్రీస్తు ఆత్మల రక్షణ అను దహమును కలిగియున్నాడు. నశించిపోతున్న ఆత్మలను రక్షించాలనే దాహం క్రైస్తవులైన ప్రతి ఒక్కరికి ఉండాలి. ఒకనాడు యేసుక్రీస్తుకు దాహముతో ఉన్ననను చేదైన చిరకనిచ్చిన వారు ద్రోహులితే ఈనాడు ఆత్మల రక్షణ అనే దాహముతోనున్న ప్రభువు యొక్క దహమును తీర్చకపోతే మనము ద్రోహులుగా పిలువబడి, ద్రోహులుగా చరిత్రలో నిలిచిపోతాము.ఎవరైతే అయన వాక్యాన్ని పాటిస్తూ , ప్రకటిస్తూ అనేకమంది హృదయాలను తడుపుతున్నారో వారే యేసుక్రీస్తుకున్న దాహాన్ని తీర్చేవారు.




# యేసుక్రీస్తు సిలువపై పలికిన ఆరవ  మాటలోని పరమార్ధము

యేసుక్రీస్తు చిరకను పుచ్చుకున్న తర్వాత పలుకుతున్న మాటయే

యోహాను 19:30- యేసు ఆ చిరక పుచ్చుకుని సమాప్తమైనదని చెప్పి తల వంచి ఆత్మను అప్పగించెను.

సాధారణముగా మనం ఏదైనా ఒక పనిని సంపూర్తి చేసిన పిమ్మటనే సమాప్తమైనదని అంటుంటాం. అయితే యేసుక్రీస్తు సిలువపై ఆరవ మాటగా సమాప్తమైనదని అనుట గల అవసరత ఏంటి? ఏ పని చేయుటకు వచ్చి ఈ మాటను పలుకుచున్నాడు?ఏ పనిని సంపూర్తి చేసి ఈ మాటను అంటున్నాడు?తనకు ఇచ్చిన ఆయుష్షు కాలము అనగా జీవిత కాలము ముగిసిపోయిందని సమాప్తమైనదని అన్నాడా?

ఇలా అనేకమైన ప్రశ్నల గల సంపూర్ణ సారాన్ని మున్ముందు తెలుసుకుందాము.

యేసుక్రీస్తు సామాన్యమైన వ్యక్తి కాదు.కలిగియున్నది ఏది కూడ యేసుక్రీస్తు లేకుండా కలుగలేదు. ఆదిలో అదియైన వాడు.

ఇంతటి మహోన్నతుడు ఈ భూమి మీదకు ఏ పని చేయుటకు వచ్చాడు?ఏ పనిని సంపూర్ణముగా చేసి సమాప్తమైనదని అంటున్నాడు?

మరి దేని గురించి అని అలోచించినట్లైతే

యోహాను 17:4- చేయుటకు నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చి భూమి మీద నిన్ను మహిమ పరచితిని.

పరలోకపు తండ్రి అప్పగించిన పనులను తనకున్న ఆయుష్షు కాలములోనే సంపూర్ణముగా నెరవేర్చి సమాప్తమైనదని పలుకు సందర్భాన్ని ఈ అరవ మాటలో మనం చూస్తున్నాం. ప్రతి మనిషికి  దేవుడిచ్చిన ఆయుష్షు కాలముతో పాటు అప్పగించిన పనులను కూడ పూర్తి చేయాలనే సారాన్ని ఈ అరవ మాట తెలియజేస్తుంది

యేసుక్రీస్తుకు అప్పగించిన అనేక పనులలో ప్రధానమైన కొన్ని పనులను ఆలోచించుట ఆవశ్యకము.

పరలోకపు తండ్రిని ఈ లోకానికి పరిచయం చేయుట కొరకు మరియు తండ్రి మనస్సును బయలపరుచుటకు లోకానికి వచ్చి ఈ పనిని సంపూర్తి చేసాడు.

దేవుని రాజ్యమును స్థాపించుటకు మరియు దయ్యము రాజ్యము చూపుటకు లోకానికి వచ్చి ఈ పనిని సంపూర్తి చేసాడు.

పాపమనే బానిసత్వములోనున్న సర్వమానవాళిని విడిపించి రక్షించుటకు లోకానికి వచ్చి ఈ పనిని సంపూర్తి చేసాడు. 1 తిమోతి 1:15-పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మదగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్య మైనదియునైయున్నది.

అట్టి వారిలో నేను ప్రధానుడను. మత్తయి 1:21- తన ప్రజలను వారి  పాపముల నుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు యేసు అను పేరు పెట్టుదువానెను. లూకా 19:10- నశించినదానిని వెదకి రక్షించుటకు మనుష్యకుమారుడు వచ్చెనని అతనితో చెప్పెను.

మార్కు 10:45-.... అనేకులకు ప్రతిగా విమోచన క్రయ ధనముగా తన ప్రాణము ఇచ్చుటకును వచ్చెననెను.

అన్యజనులైన మనకు రక్షణను కలుగజేసి దేవుని ఇంటివారిగా చేయుటకు లోకానికి వచ్చి ఈ పనిని సంపూర్తి చేసాడు.

ధర్మశాస్త్రము అను చేరలోనున్న వారిని విడిపించి క్రొత్త నిబంధన క్రిందకు తీసుకురావుటకు లోకానికి వచ్చి ఈ పనిని సంపూర్తి చేసాడు.

మనలాంటి శరీరమును కలిగియున్నాను ఏ మచ్చ లేకుండా జీవించవచ్చు అని తెలియజేయుటకు లోకానికి వచ్చి ఈ పనిని సంపూర్తి చేసాడు.

యోహాను 8:46-నా యందు పాపమున్నదని మీలో ఎవడు స్థాపించును?

రక్షణ మాటలను ప్రకటించుటకు పరలోకము నుండి భూమి మీదకు వచ్చానని చెప్పుచున్న సందర్భమును చూస్తే మార్కు 1:38- అయన ఇతర సమీప గ్రామములలోను నేను ప్రకటించునట్లు వెళ్ళుదము రండి; యిందు నిమిత్తమే గదా నేను బయలదేరి వచ్చితినని వారితో చెప్పెను.

లూకా 4:43- అయన ఇతర పట్టణములలోను దేవుని రాజ్య సువార్తను ప్రకటింపవలెను; యిందు నిమిత్తమే నేను పంపబడితినని వారితో చెప్పెను అనగా సర్వలోకానికి సువార్తను ప్రకటించే పనిని సంపూర్తి చేసాడు. యేసుక్రీస్తు భూమి మీదకు వచ్చి చేసిన పనులలో ఒక పని సువార్త ప్రకటన అని ఆ సువార్త ప్రకటన అను పనిని సంపూర్తి చేసి పలుకుతున్న మాటయే యోహాను17:4 చేయుటకు నీవు నాకిచ్చిన పని నేను సంపూర్ణముగా నెరవేర్చి భూమి మీద నిన్ను మహిమ పరచితిని. అనగా ఏ సువార్త ప్రకటనను పనినైతే జరిగించుటకు ఈ భూమి మీదకు పరలోకపు తండ్రి పంపించాడో ఆ పనిని సంపూర్ణముగా నేరవేర్చినట్టుగా అర్ధమవ్వుతుంది.

ఇలా తనకు ఇవ్వబడిన ముప్పై మూడున్నర సంవత్సరాల చిన్న జీవిత కాలములో తండ్రి అప్పగించిన పనులన్నిటిని సంపూర్ణముగా నెరవేర్చి సమాప్తమైనదని అనెను.

యేసుక్రీస్తును ధరించి క్రైస్తవులైన మన సంగతి ఏంటి? క్రైస్తవునిగా ఈ భూమి మీద బ్రతుకుచున్న మనకు దేవుడు అప్పగించిన పని ఉందని మర్చిపోకూడదు.అనగా భూమి మీద పుట్టిన ప్రతి మనిషికి దేవుడు అప్పగించిన పని ఉంది. యేసుక్రీస్తు మన వలె శరీరదారిగా జన్మించి తండ్రి అప్పగించిన అనేకమైన పనులను సంపూర్తి చేసి సిలువలో సమాప్తమైనదని చెప్పి పరలోకానికి ఆరోహణమాయెను.

దేవుడు మనకు అప్పగించిన పనిని చూస్తే

ఎఫెసి 2:10-మరియు వాటి యందు మనము నడుచుకోనవలెనని దేవుడు ముందుగా సిద్ధపరిచిన సత్ క్రియలు చేయుటకై , మనము క్రీస్తుయేసు నందు సృష్టింపబడినవరమై అయన చేసిన పనియైయున్నాము.

మనము కూడ యేసుక్రీస్తు వలె సత్ క్రియలను( వాక్యానుసారమైన క్రియలు) ఆయుష్షు కాలము ముగిసేలోపు సమాప్తము చేసి వెళ్లిపోవాలి. దేవుడు కొన్ని పనులను మన కొరకు సిద్ధపరచి ఈ భూమి మీదకు పంపాడన్నవిషయమును పై వచనము తెలియజేస్తుంది.

అనగా దేవుడు మనకు తగిన జీవిత కాల వ్యవధిని ఏర్పరిచి ఈ జీవిత కాల వ్యవధిలో చేయవలసిన పనులను సిద్ధపరచి నెరవేర్చుటకు ఈ భూమి మీదకు మనల్ని పంపాడు. దేవుడు అప్పగించిన పనులను గడిచిపోతున్న కాలముతో పాటుగా పూర్తి చేయాలన్న సత్యాన్ని మనం గ్రహించాలి. నిజానికి దేవుని పని మీద ధ్యాస ఉంటే నియమించిన ఆయుష్షు కాలములోనే అప్పగించిన పనిని పూర్తి చేయుటకు త్వరపడుతాము. నేడు ఎంతమంది క్రైస్తవులు దేవుడు అప్పగించిన పనులను సమాప్తం చేయాలనే ఆలోచనతో బ్రతుకుచున్నారు? ఫిలిప్పు 2:21- అందరును తమ సొంత కార్యములను చూచుకోనుచున్నారు గాని యేసుక్రీస్తు కార్యములను చూడరు. సువార్తను ప్రకటించే పని, దేవునికి మహిమ తెచ్చే పని, సాతానును మన పాదముల క్రింద చితకత్రొక్కే పని, అజ్ఞానాముగా మాట్లాడుచున్న వారి నోరును సత్యవాక్యము భోదించి మూయించవలసిన పని ఇలా ప్రతి పని మనం చేయవలసివారమైయున్నాము. ఇన్ని పనులను మరచిపోయిన క్రైస్తవ ప్రపంచం మరి ఏ పనులలో నిమగ్నమైపోయింది? ఎవరి పనులకై నిమగ్నమైపోయింది?లోకపు పనులలో నిమగ్నమై ఎందుకు పనికి రాని వారిగా బ్రతుకుతూ కాలాన్ని( ఆయుష్షును)పూర్తి చేసుకుని నరకానికి వెళ్ళిపోయే గుంపులో మనము ఉండక యేసులా కాలముతో పాటు పనిని పూర్తి చేయాలి. యేసుక్రీస్తుకున్న ఔన్యత్యం,నిబద్ధత ప్రతి క్రైస్తవునికి అర్ధం కావాలి. దేవుడు మనకు నిర్ణయించిన ఆయుష్షుకాలము ముగింపు లోపే అప్పగించిన పనులను పూర్తి చేయాలి. నేడు మన అనుదిన జీవితములో సువార్తను ఎంత మందికి ప్రకటిస్తున్నారు? ఏ క్షణాన ప్రాణం పోతుందో తెలియని స్థితిలో జీవిస్తున్నాము. ఆలోచించండి. పరలోకపు తండ్రి అప్పగించిన పనిని యేసుక్రీస్తు పూర్తి చేసి సమాప్తమైనదని పలికి తండ్రిని సంతోషపరిచాడు. కన్నుమూయక ముందే అప్పగించిన ప్రతి పనిని పూర్తి చేయాలని దేవుడు ఆశపడుతుంటే నేడు ఎంత మంది తండ్రి పనుల నిమిత్తం కష్టపడుచున్నారు?

దేవుని పనుల మీద మనకు ధ్యాస ,ఆసక్తి & పట్టుదల ఉండాలి.

ఇచ్చిన కాల వ్యవధిలో తండ్రి అప్పగించిన పనులను చేయాలనే తపనను యేసులో చూస్తున్నాము.

మన సొంత కార్యాలలో నిమగ్నమై ఉండుటకు ఇంత గొప్ప రక్షణను ఇచ్చి క్రీస్తు మనలను పిలువలేదు. బాప్తీస్మం పొంది క్రీస్తును ధరించుకున్న ప్రతి వారు దేవుడు అప్పగించిన పనులలో నిమగ్నమై ,సంపూర్తి చేసి ఈ లోకాన్ని విడిచిపెట్టాలి. సమాప్తమైనదని చెప్పి చచ్చిపోయే పరిస్థితి ప్రతి క్రైస్తవుని జీవితములో కనబడాలి. దేవుడు అప్పగించిన పని ఉందని, ఆ పనిలో ఉండాలని, ఆ పనిని నిర్ణయించిన ఆయుష్షు కాలములో చేయాలనే సంగతి అనేకమంది క్రైస్తవులకు అర్ధం కాలేదు.

రోమా 14:12- మనలో ప్రతి వాడును తనను గురించి దేవునికి లెక్క అప్పగింపవలెను. ఈ భూమి మీద జీవించిన జీవన విధానాన్ని బట్టి ఒక దినాన తీర్పులో మనం లెక్క అప్పగింపవలెను అని పై వచనము తెలియజేస్తుంది. ఈ లోకములో ఉన్నంత వరకు మనం చేయవలసిన పని ఏదనగా మనలను మనము లోక మాలిన్యము నుండి దూరముగా ఉండి వాక్యనుసారముగా జీవిస్తూ అనేకమందికి వాక్యమును ప్రకటించి వారి విశ్వాసాన్ని బలపరచాలి. ఈ ప్రపంచ మానవాళి ఆయుష్షు కాలాన్ని పూర్తి చేసుకుంటున్నారు కాని అప్పగించిన పనిని మిగిల్చుకుంటున్నారు. పనిని మిగిల్చుకుని ఆయుష్షు కాలాన్ని పూర్తి చేసుకుంటే పరలోకానికి అనర్హులం.ఇవ్వబడిన ఆయుష్షు కాలముతో పాటు పనిని ముగిస్తేనే మనం పరలోకానికి వెళ్ళుటకు అవకాశం ఉన్నది.




# యేసుక్రీస్తు సిలువపై పలికిన ఏడవ మాటలోని పరమార్ధం

తాను జీవించిన జీవిత కాలములో తన ప్రాణాన్ని విడుచుట ముందు అనగా చిట్ట చివరి దశలో చివరి మాటగా పలికిన మాటయే
లూకా 23:46- అప్పుడు యేసు గొప్ప శబ్దముతో కేకవేసి – తండ్రి, నీ చేతికి న ఆత్మను అప్పగించుకోనుచున్నాననెను.
వందల సంవత్సరాల క్రిందట భక్తుడైన దావీదు ద్వార దేవుడు పలికించిన లేఖనమును చూస్తే
కీర్తనలు 31-5: నా ఆత్మను నీ చేతికప్పగించుచున్నాను....
ఇదే మాటను భక్తుడైన స్తేఫెను పలికిన సందర్భమును చూస్తే అపోకార్య 7:59- ప్రభువును గూర్చి మొరపెట్టుచు యేసు ప్రభువా, నా ఆత్మను చేర్చుకొనుమని స్తేఫెను పలుకుచుండగా వారు అతనిని రాళ్ళతో కొట్టిరి. పై రెండు సందర్భాల వచనాలను ఆలోచిస్తే కన్ను మూసే లోపు వారి ఆత్మలను తండ్రికి అప్పగిస్తునట్లు ఆటూ యేసుక్రీస్తు మాటలో ఇటూ స్తేపెను మాటలో చూస్తున్నాము.
తనకున్న చిన్నపాటి ఆయుష్షు కాలములో పరలోకపు తండ్రి ఇష్టాన్ని నెరవేర్చి ,వాక్యానుసారమైన ప్రవర్తన కలిగి, అప్పగించిన పనులన్నిటిని పూర్తి చేసి చిట్ట చివరికి తన ఆత్మను యేసుక్రీస్తు పరలోకపు తండ్రికి అప్పగిస్తున్నట్లుగా అర్ధమవుతుంది. భూమి మీద బ్రతుకుతున్న మనమందరి కి అనగా ఆత్మలుగా ఉన్న మనమందరికి మన తల్లి గర్భములో చక్కని శరీరాన్ని నిర్మించి ఒక సంకల్పముతో భూమి మీదకు దేవుడు పంపించా డు. వాస్తవానికి భూమి మీదకు వచ్చిన ప్రతి మనిషి ఒక రోజున శరీరాన్ని విడిచిపెట్టి ఆత్మను దేవునికి అప్పగించాలి. కన్ను మూసే లోపు అనగా కలిగియున్న ఆయుష్షు కాలము కరిగిపోయే ముందే తండ్రి ఇష్టాన్ని నెరవేర్చుటకు ప్రతి మనిషి పుట్టుకొస్తున్నాడు.
ఇలా పుట్టిన ప్రతి మనిషి తండ్రి సంకల్పాన్ని బ్రతుకులో నెరవేర్చి ఆత్మను అప్పగించాలి.
బ్రతికినంత కాలము వాక్యానుసారమైన ప్రవర్తనతో దేవుని ఇష్టాన్ని నెరవేరుస్తూ చివరికి మన ఆత్మలను అప్పగించాలి అని పేతురు అంటున్న మాటను చూస్తే 1 పేతురు 4:19-కాబట్టి దేవుని చిత్త ప్రకారము భాదపడువారు సత్ ప్రవర్తన గలవారై, నమ్మకమైన సృష్టికర్తకు తమ ఆత్మలను అప్పగించుకోనవలెను.
దేవునికి మన ఆత్మను ఎందుకు అప్పగించాలి? అద్భుతమైన శరీరాన్ని నిర్మించి అందులో ఆత్మను ప్రవేశపెట్టి తన కోసం బ్రతికి తిరిగి తన యొద్దకు రావాలనే సంకల్పము కలిగియున్నాడు కనుకనే మన ఆత్మను అప్పగించాలి.
గలతీ 5:16- నేను చెప్పునదేమనగా ఆత్మానుసారముగా నడుచుకోనుడి, అప్పుడు మీరు శరిరేచ్చను నెరవేర్చరు. అనగా వాక్యానుసారముగా, అత్మానుసారముగా జీవిస్తున్నప్పుడు శారిరేచ్చలను నెరవేర్చుకొనుటకు అవకాశం ఉండదు. ఆత్మయైన నీవు కలిగియున్న శరీరాన్ని లోబరుచు కొని శరీర ఇచ్చలు జరిగించక దేవుని కొరకు జీవించాలి. ఇలా బ్రతి చివరికి చనిపోయి వచ్చిన చోటుకు తిరిగి రావలన్నది దేవుని సంకల్పము. అస్సలు నేను ఆత్మను అనే సంగతిని మరచి ఆత్మ సంభంధమైన కార్యక్రమాల గూర్చి ఆలోచించక శరీరం మీద ద్రుష్టి పెట్టి శరిరేచ్చలు నెరవేరుస్తూ ఆత్మను చెడుకు లోబరుస్తున్నారు.
ఆత్మ సంభంధమైన ఆలోచనలతో కాక కేవలము శరిరేచ్చలను నేరవేర్చుకుంటూ దేవుడు పవిత్రముగా , పరిశుద్దముగా ఇచ్చిన ఆత్మను భయంకరమైనదిగా మార్చుకుని చివరికి చనిపోతే ఆత్మను పరలోకానికి అంగీకరిస్తాడా? లేదు. ఎలా వచ్చామో అల తిరిగి తండ్రి దగ్గరకు వెళ్ళాలి. దేవుని ఇష్టాన్ని నెరవేరుస్తూ వాక్యానుసారమైన ప్రవర్తనను కలిగి ఆత్మను ముందుగానే తండ్రికి అప్పగించుకోవాలి. శరీర సంభంధమైన కార్యాలలో

నిమగ్నమైనవాడు ఆత్మను ఆపవిత్రం చేసుకుంటాడు. సత్ క్రియలతో వాక్యనుసారముగా బ్రతికేవాడు ఆత్మను పవిత్రముగా కాపాడుకుంటాడు. అనగా పవిత్రమైన కార్యాలలో ఉంటె ఆత్మ పవిత్రముగా ఉంటుంది అలాసే ఆపవిత్రమైన కార్యాలలో ఉంటె ఆత్మ ఆపవిత్రమైన కార్యాలలోసే ఉంటుంది .

ఆత్మను అప్పగించుకోవాలంటే మొట్ట మొదట దేవుని పనిలో మన శరీరాలు వాడబడాలి. యేసుక్రీస్తుకు పరలోకపు తండ్రి అప్పగించిన పనిని సంపూర్తి చేసి చివరికి తన ఆత్మను అప్పగించుకుంటున్నాడు. ఏ రీతిగా అయితే యేసుక్రీస్తు, స్తెఫెను అప్పగించిన పనులను సంపూర్తి చేసి ఆత్మలను అప్పగించుకున్నారో ఆ రీతిగాసే మనం కూడ కలిగియున్న చిన్నపాటి జీవితములో వాక్యానుసారమైన ప్రవర్తన కలిగి ,తండ్రి ఇష్టాన్ని సెరవేర్చి ఆత్మను అప్పగించుకోవాలి.

## ఇలాంటి ఆత్మీయ సందేశాలు కావాలంటే సంప్రదించండి.


# శివ ప్రసాద్

# 09290121831